

# కేవస్సే మామూలు

మామూలా? మామూలుగా ఎంతిస్తారో అంతిస్తారా? యెక్కండ్సార్.. మీరెంతిస్తే అంత అదే మామూలనకుంటాగాని... రిక్షా నాకొడుకంటే ప్రెతోడికీ శీపే.. మీకూ శీపన్ను గానీ.. మా కడుపు మంట సారో... మజ్జానమా పోలీసాయన్జేసిన పనికి కడుపింకా మండిపోతానే వుండ్లా.. రిక్షా నా కొడుకంటే పోలీసోళ్ళకి యింకా శీపు.. యేమంటారా?

మజ్జానం బశ్శాండ్ కాడుణ్యా... నాలుగుదినాల్నుంచి సలీజెరం ఈ పొద్దు కొంచిం తగ్గింది గదా.. నాల్రూపాలు సంపాదిచ్చుకుంటే యీ పూట కడిపి నిండా తినచ్చునుకుణ్యా.... రాకరాకొచ్చిన బోణీ యేమొచ్చింది?.... పోలీసోడే రావాల్నా? వచ్చినోడు ధఢామని బండ్లో కూసునేసి - "పోనీరా నాయాలా!" అనాల్నా.. బేవార్సి బతుకుసార్ రిక్షా నాకొడుకు బతుకు... యాడికయ్యా అంటే - "పోనీరా నాకొడకా" అనె.. పోతిన్సార్.. యాడికి? యందూరం? శ్టాండు రూడ్డంతా తొక్కినా... శిన్న బజారు దిరిగినా.. మెయిన్ రూడ్డు రూడ్డంతా తొక్కినా.. యాడా నిలప్మన్లా.. "అరె- పోనీరా.. గుసపోస్తావేందా?" అనె... రిక్షా నాకొడుకు బతుకంటే గుసపోసేదే గదా.. అది గూడా తప్పా.. చెప్పుసారో..

పొయ్యా పొయ్యా....ఆరట్సు కాలేజి టర్నింగు దిగతావుంటే - "వారే కొంచిముంద్రా" అన్నాడు. బ్రేకేసి నిలిపితే - "యీడగాదురా - పక్కన బెట్రా" అన్నాడు. సైడ్లో నిలపుకున్నా.. ఆహా.. పోలీసాయన్దిగ-లేదుబండి...

యిదేం గిరాకీరా దేవుడా!.. అనుకుంటూ నేనెనక్కి జూస్తే.. టాప్ పట్టా కింద నుంచి మిర్రి మిర్రి చూస్తావుండాడు.. అయితే అది సార్ సూపు.. పోలీసూపంటే అదిసార్.. అట్నే సూశినాడు సూశినాడు.

ఏందబ్బా సూస్తావుండాడని నేనూ ఆ పక్కి జూస్తే ఆ పోలీసూప్పడి న్దగ్గర.. అంటే రూడ్డుకాపక్కన.. మేళ్ళున్నాయి.. అన్నీ మేళ్ళే.. మేళ్ళుంటే మణుసులుండరా.. వస్తావుంటారు.. పోతావుంటారు.. అంతే నాగ్గనిపించింది.. ఇంకేముండాదని సూడాల?

అట్ట నేను జూస్తావుంటే, నా శీట్ను బూట్ కాల్తో ధఢామని తన్నేసి "అర్రె.. పోనీరా నా కొడకా!" అన్నాడు పోలీసాయన.

బయిం బట్టుకునింది నాకు.. యీ గిరాకీ వొదిలే రకం గాదనుకున్నా...

మల్లా బజారుకు బొమ్మన్నాడు. ఆ పక్కి నుంచి రెండు సందులు దిప్పించినాడు. మల్లా నిలుపుకొమ్మన్నాడు. ఆడేముండాది? బ్రాందీ షాపుండాది. "గుడిసి కాడ పనుండాది.. ఇంక నేన్పోతయ్యా" అన్నా. "అర్రె..

అప్పుడేందిరా! నేనొస్తానుంద్రా.." అంటా బ్రాందిషాపులోకి బోయినాడు.

బాడిగ లేకుంటే బాయ్ యీ కాళ్ల పీకుడు దప్పాతుందని యెల్ పోదామనుకుంటే.. వుండమన్నాడు గా..

గంటా రెండు గంటగ్గాని రాడను కుంటే ఐదే ఐదునిమిషాల్లో వొచ్చేశినాడు పోలీసాయన.. మొకం యెలిగిపోతా వుంది.. జోబీ తడుముకుంటా నవ్వు కుంటా వుండాడు..

జోబీలోకి ఏం వొచ్చిందో.. యెందుకొచ్చిందో.. నాకెట్టా దెలుస్తుంది సారో.. రిక్షా నా కొడుకుని..

అట్ట మల్లా యెక్కి కూసోని - "అర్రే.. ఆ యింటి కాడికి పదరా-" అన్నాడు.

"యా యిల్లయ్యా?...."

"బేవార్సి నాకొడక - కళ్ళు దిరగతా వుండాయా? యిప్పుడే గదరా వొచ్చిందాణ్ణుంచి..... కాలేజీ పక్కన నిలపలా నువ్వు?... " అన్నాడు.

నా ఖర్మెంతర మనుకుంటా మల్లా దొక్కినా అంతకు ముందక్కడ. యెందుకు నిల్పినామో దెలదు మల్లా యెందుకు బోవాల్నో దెలీదు. తీరా ఆడికిబోయి సైడ్న నిలుపుకుంటే - "వొరే - చెట్టుకింద బెట్టుకోరా " అన్నాడు.

శెట్టు కింద బండి బెట్నా, పోలీసాయన్దిగలా.. దిగేట్టేలా.. మల్లా టాపు కింద నుంచి పోలీసూపు సూశినాడు సూశినాడు -



నేను మాత్రం బండి దిగి సైడుకుబోయి ఒంటేగ్గాసోని మల్లా బండెనక్కొచ్చి యేందబ్బా యీ పోలీసోడు సూశేదీ.. అనుకుంటా... రోడ్డుకాపక్క మేళ్ళ పక్క జూసినా.. నేన్జూశేటప్పుడే.. పచ్చమేడ మెట్ల దగ్గిరి ఆడ మణిశి గనిపించె... ఆడ మణిశి మెట్లు దిగతావుంటే పైన తలుపులు మూసుకున్నాయి...

"అర్రె.. రారా నా కొడకా!..." అంటా రంకేశినాడు పోలీసాయన.

కతేందో నాకప్పుడే కొంచెం కొంచెం అర్తమై తావుండాది... బండెక్కి పెడలేశ్నా...

టాప్ పట్టా కిందనుంచి సూస్తానే - "అరె మెల్లిగా యెడం పక్క - సైడుగా పోనీరా-" అన్నాడు.


సైడుగా మెల్లిగా పోతానే... రోడ్డు అవతాలసైడు పక్క సూసేసి సూస్తా వచ్చినా... మేడదిగిన ఆడమణిశి పచ్చశీరలో వుండాది శిలకమాదిరే వుండాది.. శకశకా నడిశిపోతా వుండాది.. ఆ మణిశిని నేనంతకు ముందెప్పుడూ యాడాసూళ్ళా...

"అర్రె.. పిట్ట బోతావుంది సూద్రా.. యెనకనే బోనీరా-" అన్యాడు పోలీసాయన.

శిలకను నేన్జూశేశినానని కనిపెట్టేశి నాడు. అందికే పిట్టబోతావుంది - అన్యాడు గాని యేం పిట్టో యేరే జెప్పలేదు గదా-

యేం దెలీనట్టు అమాయకంగా





అడిగితే బూటాకాల్తో తన్యాతన్నాడని నేనింకేవ్వీ మాట్లాడకండా - శిలక న్నూసుకుంటా పెడలేశినా -

శిలకట్నే పాయి పాయి లక్ష్మి షీట్ష్టాల్ దగ్గిర సన్న సందుకు దిరగబోతావుంటే "అర్రె పదపదరా" అన్జెప్ప తొందరజేశేసినాడు పోలీసాయన

ఉశిగొలిపితే కుక్క దూకాల్నా వొద్దాసారో... దూకినట్టే పెడలేశ్నా.. రిక్షా సందుకాడికి బోతావుండాదో లేదో రిక్షా శబదమిని శిలక తిరిగి సూస్తా వుండాదో లేదో, గెద్ద గదా దూకినట్టు పోలీసాయన అట్నే బండి దిగేశి పొయ్యి శిలకను రెక్కబట్టి నిలిపేశినాడు.

శిలకెట్ట జూశిందంటే.... వల్లోబణ్ణ పావరం మాదిరే జూసింది.

"యెక్కణ్ణుంచొస్తా వుండావే లంజా... " అన్నాడు పోలీసాయన.

యేడిచేస్తుందేమో శిలక - బయపడి పోయి గుండెకాయలు గుద్దుకునే



స్తుందేమో ననుకున్నా.... అ హాఁ - లేదు లేదు శిలక బెదిరింది బెదిర్నాయ్య.... అట్ట బెదిరేది మామూలైపాయినట్టే సూశి - "మాయక్కోళ్ళింటి కాణ్ణుంచి" అనేశింది.

"ఆఁ హాఁ .... మీ యక్క " అని యెటకారంగా తీసిపారేశి... "నేనంతా సూశానే లంజా- నువు మిద్దెక్కి దిగిపోతే వూరువూరంతా కళ్ళు మూసుక్కుంటుందనుకున్నావా? వూరు సూడకుంటే పోలీసోడు సూడ్డను కున్నావా? శెప్పు- యెంత గుంజు కొచ్చుకున్నావు?" అన్నాడు పోలీసాయన.

"లేల్లేదు - ఆ యింట్లో మాయక్క పాశిపని జేస్తాది .... యియాల మాయక్క బోకపోయే కాడికి" అంటా యింకా రాగం తీసేశింది శిలక.

ఆ మాటకి ఇంకా వుడుకెత్తి పోయింది పోలీసాయనకి. పట్టుకున్న శెయ్యి

యింకా బిర్ర బిగించేశినాడు. ఉరిమురిమి సూశేశి నాడు - "శ- పాశిముండ-? అనేసి ఎంగిలూసినంత పన్జేశినాడు.

"ళంజరికం జేసి పాశిపన్జేశినానంట వేందే లంజముండా - యిట్ట తప్పుడు కూతలింకా గూస్తే... బొక్కలో పెట్టేస్తాను - అయినా నాకు తెల్సే అడగతాగాని - నీకు బావలేగాని - అక్కలెక్కణ్ణుంచొచ్చారే...ముందు నువ్వు డబ్బుల్తీస్తావా?... నన్నుగాని దీస్కోమంటావా?! అన్నాడు.

ఆ మాటతో వోడిపోయింది శిలక. అట్టా యిట్టా గాదు - పూర్తిగా వోడిపోయిందిక, తలొంచుకునేశి, బొడ్లో శెయ్యిబెట్టి శిన్న మణీపర్సు దీశి, దాంట్లో నుంచి దెండు కాయితాల్దీశింది, "యేముంది? యింతే -" అనింది.

యికిలించేశినాడు పోలీసాయన, "యిది పై సరుకులే - నాకు నేర్పిస్తావా? లోపల్సరుకు దీ- తీ..." అన్నాడు

జాకెట్టు పక్క జూస్తా.

శిలకద్దెగ్గిర యిన్ని సరుకులుంటయని మనకందాకా తెలీదుగదా - నోర్దెరుసుకుని సూస్తావుణ్నా...

శిలకప్పుడు జాకెట్టులోకి శెయ్యిపెట్టి - అంటే పైనుంచి లోపలికి శెయ్యిపెట్టి - యింక రెండు కాయితాల్దీశింది.

పోలీసాయన మాటేనిజమైందని నాకు బలే యిడై పోయింది... గెర్ద సూపే ముంది - డేగ సూపేముంది - సూపంటే పోలీసాడిదే సూపనుకున్నా..

అయితే పోలీసాయ్ననప్పు ఆకాడితో గూడా అయిపోలా ...జాకిట్టు లోపలికే సూశినాడో శిలకమొకంలో ఇంకేమేవి సూశినాడో గాని... "అర్రె.. యింకా కిందుంది తియ్యే-" అన్నాడు. ఆ గొంతుగొంతు కాదు. బాకుమెరిశినట్టే అనిపించేశినాది సారో -

శిలకప్పుడింక బావిలోకి దిగబడి పోయినట్టయి పోయింది. ఇంకేం మాటే లేకుండా.. జాకిట్టు కింద నుంచి కెలికీ.. అంచు లోపలి తట్నించే.. అక్కడేందో శీక్రేటుగా సన్న జోబీ పెట్టుకునిందేమో శిలక - అక్కణ్ణుంచి యింక రెండు కాయితాలు దీసింది.

ఆ శేతుల్నించి డబ్బు గుంజేశినాడు సారో.. శిలక మొహం పక్క శితక బొడి శేసినట్టు సూశినాడు..

"దొంగ లంజ.. మీయక్కిచ్చిన డబ్బుగదా యిది..యెది? పాశిపన్జేశి! ఆ!" అని ఉరిం పొరేశినాడు.


శిలక్కంట్లో నీళ్ళు దిరిగేశానయంటే, తిరగవా సారో - ఎర్రటెండలో ఆ యెర్రి శిలక కంట్లో నీళ్ళు నిప్పుల మాదిరే మెరిశినాయి.. మెరవ్వాసారో..

యింకప్పుడు పోలీసాయన యెట్టా నవ్వేశినాడంటే.. సవుద్రవు నుంచి బూవిని పైకి దీసినపుడు వరాహసావి నవ్వి వుంటాడా? సారో.. నవ్వే వుంటే - అట్ట - అట్ట నవ్వినాడు.. నవ్వి...-

"దేనికైనా దర్మముండాలే లంజా... దర్మం యేందంటే-" అంటా, వొక నోటుదీసి దాని చేతిలో బెట్నాడు. "యింకెప్పుడూ, పోలీసోడికి మాత్రం







అబద్దం శెప్పద్దు.. పోపో-" అనేశి, నోట్లు నిక్కరు జోబీలో దోపుకునేశి .. వొచ్చి ధఢామని బండెక్కేశినాడు, "సూస్తావేందిరా దొంగనాయాలా! పోనీ - పోనీ యింక -! అని నన్ను మల్లా గాబరాపెట్టేశినాడు.

యింకప్పుడు తలదిప్పి శిలకపక్క సూడాలన్యా బయివేసింది నాకు ఫెడలేశినా యేశినా...బజారంతా మల్ల యేసినా..

జరిగిందంతా తల్సుకుంటే కడుపులో దేవేశినట్టయి పోయింది.... అయితే నేనేం జేశేది? రిక్షా నా కొడుకును - దరిద్రం రిక్షా దిగిపోతే సాలనుకున్నా నంతే..

అయితే అంతలో గూడా దిగలేదు గదా- మల్లా రొండీదులు దిప్పి యింకో బ్రాందీ షాపు ముందర నిలపమన్నాడు... నిలిపినా... జోబీలు తడుముకుంటా లోపలికి బోయినాడు.

వస్తాళ్ళే వస్తాళ్ళే అనుకుంటే అరగంటైనా రాలేదు - గంటైనా రాలా..

కాళ్ళు పీకింది పీకి, కడుపులో ఆకలి గూడా మండి పోయింది. నోరెండి పోయింది గదాని జూస్తే దెగ్గిర్లో కొళాయి గూడా కనిపించలేదు.. అట్నే యెల్లిపోదామని గూడా అనిపించేశింది గాని.. మల్లా కనిపిస్తే తంతాడని బయివేసి అట్నే రిక్షాలో కూలబడి పోయినా.. పెర్నానికి నిద్రగూడా వొచ్చేస్తావుంటే..

అప్పుడొచ్చేశి బండి శక్రాన్ని బూటు కాల్తో కరాకరామని కదిలించేశాడు పోలీసాయన

"లెయ్‌రా నాకొడకా.. అప్పుడే నిద్రగూడానా..నీ యవ్వ.." అంటా శెడ్డ మాటల్దిట్టేశినాడు..

నాకర్మన్టిట్టుకున్నాను, యింకేం జేసేది...

పోలీసాయన నోట్నించి గుప్పు గుప్పుమని కొట్టేశింది వాసన.. బండ్లో బాపమాదిరి కూలబడి పోయ్నాడు.



"పోనీరా.. బండ కాల్నీకి బోనీ".. అన్నాడు
బండకాల్నీ అంటే ఆ బజారు కాణ్ణించి ఒకటిన్నర మైలు..

నేనొచ్చేపోయినాననుకుని.. ఫడలేశ్నా యేశ్నా..

బజార్లన్నీ దాటుకోని బండకాల్నీకి మిట్టలో దొక్కుతా వుంటే, రిక్షా శక్రం నా గుండ్లె మీద బోతావుండాదనిపించింది సారో..

బండ్లో జూస్తె పోలీసాయన మజ్జి మజ్జిన తిట్నాడేగాని... మిట్టగదా.. కొంచిం దిగదామని గూడా అనుకోలా..

మిట్ట కాల్నీలో వాల్లింటి కాడ ఆయన్ని దించేశి– స్రాలాయీ బతుకు బగవంతుడా.. అనుకున్నా...

తూల్తా పేల్తా పోలీసాయన యింట్లో కెల్పోతా వుంటే.."అయ్యా!..." అని మాత్రం 'అన్నా.. బాడిగ డబ్బిస్తాడని..

ఆయన కనపణ్ణేలేదు – లోపలికెల్పోయినాడు. యెదవ బుద్ది.. అప్పుడే వొచ్చేశుంటే సరిపొయ్యేదిగాదా.. యేందో.. ఆశిగదా.. ఆణ్ణే వుణ్నా యింకా నిలబడి.. అంతలోకి పోలీసాయన పెళ్ళామనుకుంటా.. ఆయమ్మొచ్చి.. ఏం గావాలని అడిగింది.

"అమ్మా రిక్షా వోణ్ణమ్మా.. అయ్యను దీసుకొచ్చినా... బాడిగ డబ్బియ్యాల..." అన్నా..

ఆయమ్మ మల్లా లోపలికి బోయింది చానేపిటికి బైటికొచ్చింది. "యింద" అంటా రూపాయిబిళ్ళ శేతిలో బెట్టింది.

నా కింక తలగొట్టేశినంత పనైపోయింది.

"అదేందమ్మా.. వూరంతా దిప్పినా.. బజార్లంతా దిరిగినాం.. మిట్టంతా దొక్కినా.. యిదేందమ్మా.. రూపా యేందమ్మా.. అన్నా..

ఆయమ్మ యింకేం మాట్లాళ్ళా.. మల్లా లోపలికి బోయ..

నోరుబెట్టుకుని అడిగిన్దానికి.. యెంత పోలీసాయినైనా.. మరీ అంత అన్నాయం గాదులే అనుకుంటా వుణ్నాగాని...

నేనప్పుడనుకోనే లేదు సారో...

అంతకు ముందేగదా – తూల్తా తూల్తా లోపలికి బోయిన పోలీసాయన.. అప్పుడు పావు మాదిరి కొండ శిలవ మాదిరి బైటకొచ్చేశినాడు.. వొచ్చీరాంగానే నన్ను మెడ మీద శెయ్యేశి వొంచేసి నాడు.. తన్నేశినాడు.. బూట్కాల్తోనే తన్నేశి నాడు.. శెడ్డమాట్లన్నీ దిట్టేశినాడు "బాడిగ్గావాల్నారా నా కొడకా.. బాడిగ్గా వాల్నా.. యెంత గావాల్రా నా కొడకా.. యెంతగావాల్రా.. సాల్దా నీకు.. సాల్దా.." అంటా తన్నాడు.. వొక్కో మాట జెప్పి వొక్కోతన్ను తన్నాడు – నా యెముకిలిరిగిపోయినాయి. ధఢామని తలుపు లేసుకుని లోపలికెల్పోయినాడు.. ఎంచేపట్ట పడిపోయినానో.. పడిలేశి... కింద బడి మీదబడి.. బండ్లో బడి.. వూర్లోకొచ్చినా.. బాడిగా.. ఆ రూపాయి గూడా దక్కలేదు సారో..

వొచ్చేశిందిగదా.. యిగ దిగతారా సారో.. దిగండి దిగండి... మీరు గనిపిస్తే.. యింటా వుండారని సోదంతా జెప్పేశినాగాని.. రిక్షనాకొడుకు సోది యెవురింటారు సారో..

మూడ్రూపాలా? సాలు సారో.. మామూలుగా ఇంతే ఇస్తార్లే సారో...సాలు..

అయితే నాలాంటి రిక్షా నాకొడుక్కి.. అంతా మామూలైపోయింది సారో..



## గొడుగు కథ

కథా శివ బ్రహ్మం గారు నిర్మాతలకు కథలను వివరించడంలో వర్ణించడంలో దిట్ట. ఏ చిన్న సన్నివేశాన్నైనా వివరంగా, సూక్ష్మమైన అంశాలతో చెప్పేవారు.

ఆయన ఒక రోజున ఒక సినిమా ఆఫీసులో కథ చెపుతున్నారు. కథానాయిక రోడ్డు దాటుతూ గొడుగుతో పడ్డ అవస్థను ఆయన సుమారు అరగంట పాటు చెప్పారు. నిర్మాత, దర్శకుడు, సహాయదర్శకుడు, ఉత్కంఠతో వింటున్నారు. ఆ సన్నివేశం ముగిసింది. బాగుందంటే బాగుందన్నారు. ఒక సహాయ దర్శకుడు "ఈ సన్నివేశం సినిమాలో ఎంతసేపు జరుగుతుంది?" అనడిగారు.

దర్శకుడు..... ఆలోచించి "45-50 సెకండ్లపాటు" అన్నారు.

"బ్రహ్మంగారు.... గొడుగును మరీ పొడుగు చేసి చెప్పారేమో!" అన్నాడు సహాయ దర్శకుడు. బ్రహ్మంగారు నవ్వారు. మిగతా వారు బిక్కమొగం వేశారు.